సాక్షి
ఆదిలాబాద్

గురువారం । 18 । మే । 2023



మూగజీవాలు విలవిల 8లో ▸
ఎండలు మండిపోతుండడంతో మూగ జీవాలు అల్లాడుతున్నాయి. ఉదయం, సాయంత్రం మాత్రమే బయటకు తీసుకెళ్లాలని పశువైద్యులు సూచిస్తున్నారు.



ముగిసిన సీఎం కప్ పోటీలు
జిల్లాలోని ఆయా మండలాల్లో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. 9లో ▸

గరిష్టం/కనిష్టం
42.0/29.0

వాతావరణం
మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. వడగాలులు బాగా వీస్తాయి. పగలంతా ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిసెట్

ఆదిలాబాద్‌టౌన్: పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం బుధవారం నిర్వహించిన పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిమిషం నిబంధన ఉండడంతో విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,201 మంది హాజరు కావాల్సి ఉండగా 1,117 మంది హాజరై 84 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. కాగా, ఇచ్చోడకు చెందిన ఓ విద్యార్థిని జిల్లా కేంద్రంలోని సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలోగల పరీక్ష కేంద్రానికి రెండు నిమిషాలు ఆలస్యంగా రాగా అధికారులు అనుమతించలేదు.

25లోగా అడ్మిషన్ పొందాలి

ఆదిలాబాద్‌అర్బన్: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి ఏప్రిల్‌లో నిర్వహించిన అడ్మిషన్ టెస్ట్ పాసైన అభ్యర్థులు ఈ నెల 25లోగా సంబంధిత పాఠశాలల్లో అడ్మిషన్ పొందాలని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల రీజినల్ కో ఆర్డినేటర్ వీ గంగాధర్ తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి 6,7,8,9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఫలితాలు విడుదల చేశారని పేర్కొన్నారు. అభ్యర్థులు tgtwgurukulam. telangana. gov. in నుంచి ప్రవేశ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకొని వారికి కేటాయించిన పాఠశాలల్లో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, టీసీ, బోనఫైడ్ సర్టిఫికెట్లు అందించి అడ్మిషన్ పొందాలని సూచించారు.

డిగ్రీ పరీక్షలు వాయిదా

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 4, 6 సెమిస్టర్ పరీక్షలు ఈనెల 22వ తేదీ నుంచి జరగాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదా పడ్డాయని కేయూ పరీక్షల విభాగం కంట్రోలర్, అడిషనల్ కంట్రోలర్ మల్లారెడ్డి, నరేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు జూన్ 13నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆంక్షలు లేకుండా జొన్నలు కొనుగోలు చేయాలి



నిరసన తెలుపుతున్న రైతులు

కైలాస్‌నగర్: యాసంగిలో పండించిన జొన్నలు ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని తాంసి మండలం జామిడి గ్రామ రైతులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఎకరాకు 15–20 క్వింటాళ్ల దిగుబడి రాగా, ప్రభుత్వం ఎకరాకు ఐదు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించిందని పేర్కొన్నారు. మిగతా జొన్నలు ఎవరు కొనాలని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆంక్షలు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే బాపురావు



మంత్రితో ఎమ్మెల్యే, నాయకులు


బోథ్: రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి త్వరలో డబుల్ బెడ్రూం ఇళ్లకు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట బోథ్ ఏఎంసీ చైర్మన్ రుక్మన్‌సింగ్, కరంజి సర్పంచ్ నరేందర్ తదితరులున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



2కే రన్ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: ఆరోగ్యమే మహాభాగ్యమని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పేర్కొన్నారు. ఈ నెల 28న నిర్వహించనున్న రిమ్స్ వైద్యకళాశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం 2019వ బ్యాచ్ మెడికోలు 2కే రన్ నిర్వహించారు. రిమ్స్ ఆస్పత్రి నుంచి పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మెడికోలతో కలిసి రన్‌లో పాల్గొన్నారు. అనంతరం స్టేడియంలో వైద్య విద్యార్థులు వివిధ యోగాసనాలు వేశారు. రిమ్స్ వైద్యులు తిరుమల్‌రెడ్డి, ఓంప్రకాశ్, వినోద్ ఉన్నారు.



ఎస్‌ఈ కార్యాలయంలో విచారణ జరుగుతుండగా బయట వేచి చూస్తున్న ఉద్యోగులు

- మళ్లీ తెరపైకి అక్రమంగా విద్యుత్ మీటర్ల జారీ బాగోతం
- విచారణాధికారిగా వరంగల్ సీజీఎం
- మూడ్రోజులు కొనసాగనున్న విచారణ
- గతంలో పలువురు ఆఫీసర్లపై చర్యలు
- తాజాగా ఎవరిపైనోనని గుబులు

కొరడా ఎవరిపై..?



సాక్షి, ఆదిలాబాద్: విద్యుత్‌శాఖలో గతేడాది సంచలనం కలిగించిన అక్రమంగా విద్యుత్ మీటర్ల జారీ బాగోతం మరోసారి తెరపైకి వచ్చింది. అప్పట్లో సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు ఆదేశాల మేరకు ఎస్‌ఈ (డీపీఈ) పర్యవేక్షణలో 30 మంది అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఆ తర్వాత ఇద్దరు ఏడీఈలపై సస్పెన్షన్ వేటు వేయడం, మరో ఇద్దరు అధికారులను బదిలీ చేయడం, ఒక ఆర్టిజన్‌ను తొలగించడం జరిగింది. అప్పటికే పోలీస్ కేసు నమోదై ఉండడంతో ఇక వారే పూర్తిస్థాయి విచారణ జరిపి నిగ్గు తేలుస్తారని శాఖలో ప్రచారం జరిగింది. విద్యుత్‌శాఖలో ఈ అక్రమ కోణం ఆ తర్వాత సద్దుమణిగింది. తాజాగా సీఎండీ ఆదేశాలతో దీనిపై పూర్తిస్థాయి విచారణాధికారిగా ఐపీసీ అండ్ ఆర్ఏసీ వింగ్‌కు చెందిన సీజీఎం మధుసూదన్‌ను నియమించారు. ఆయన మూడ్రోజుల ఎంక్వైరీ మొదలైంది. బుధవారం కొందరు అధికారులను జిల్లా కేంద్రంలోని ఎస్‌ఈ కార్యాలయంలో విచారించారు. మరో రెండ్రోజుల పాటు విచారణ కొనసాగనుంది. తాజా విచారణ అనంతరం మళ్లీ ఎవరిపై చర్యలుంటాయోనని పలువురు అధికారులు, సిబ్బందిలో అలజడి నెలకొంది.

ఇదీ.. జరిగిన వ్యవహారం

విద్యుత్‌శాఖలో మీటర్ల బాగోతానికి సంబంధించి గతేడాది మార్చి 23న విద్యుత్‌శాఖ అధికారులే ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అయితే కేవలం 40 మీటర్ల అక్రమాలు జరిగాయని, 2019 నుంచి ఈ వ్యవహారం సాగుతున్నట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అప్పట్లో చిన్నపాటి అక్రమ వ్యవహారమని అందరూ భావించారు. అయితే దీనిపై పలు విమర్శలు రావడంతో సీఎండీ ఆదేశాలతో ఎస్‌ఈ (డీపీఈ) పర్యవేక్షణలో 30 మంది అధికారులు అప్పట్లో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ప్రధానంగా ఆదిలాబాద్ సబ్‌డివిజన్ పరిధిలోని ఏడీఈ (ఆపరేషన్) పరిధిలోని ఆదిలాబాద్ పట్టణం, ఆదిలాబాద్ మండలంలో ఈ మీటర్లు పెద్ద మొత్తంలో జారీ చేసినట్లు గుర్తించారు. ఎంక్వైరీలో 2,500కు పైగా అక్రమంగా మీటర్లు జారీ చేసినట్లు కనుగొన్నారు. దీంతో నష్టం మొదట కొంతమేరే ఉందని భావించినప్పటికీ ఆ తర్వాత మీటర్ల సంఖ్య పెరగడంతో పెద్ద మొత్తంలో సంస్థకు నష్టం వాటిల్లిందని గుర్తించారు.

అక్రమం జరిగిందిలా..

విద్యుత్ శాఖలో ఒక మీటర్ జారీ చేయాలంటే వర్క్ ఆర్డర్ రూపంలో ప్రక్రియ సాగాలి. మీసేవలో నమోదు తర్వాత ఆన్‌లైన్ లాగిన్‌లో ఏడీఈ దానికి అంగీకారం తెలిపిన తర్వాత ఏఈ లాగిన్‌కు చేరుకొని అక్కడినుంచి క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా వినియోగదారుడికి మీటర్ అందించేలా ప్రక్రియ సాగుతుంది. అయితే ఇలాంటి ప్రక్రియ ఏమీ లేకుండా ఓ ఉద్యోగి మీటర్లు జారీ చేయడం, దానికి అధికారులు పరిశీలన చేయకపోవడంపై విస్మయం వ్యక్తమైంది. నేరుగా డబ్బులు తీసుకొని మీటర్ ఇవ్వడం, క్షేత్రస్థాయి సిబ్బంది ఆ మీటర్‌ను వినియోగదారుడి గుమ్మంలో బిగించడం, దానికి స్తంభం నుంచి తీగ లాగి విద్యుత్ సరఫరా చేయడం జరిగిపోయాయి. తిలాపాపం.. తలా పిడికెడు అన్న చందంగా ఈ అక్రమ వ్యవహారంలో పలువురు భాగస్వాములయ్యారు. ఆన్‌లైన్ లాగిన్‌లో దానికి సంబంధించిన ప్రక్రియ పూర్తి కాకపోవడంతో అధికారికంగా బిల్లు జారీ మొదలు కాలేదు. రోజులు, నెలలు మీటర్ తిరిగినా నంబర్ జారీ కాకపోవడంతో బిల్లులు వసూలు కాలేదు. అక్రమం బయటకొచ్చిన తర్వాత అధికారుల క్షేత్రస్థాయి విచారణలో వేల సంఖ్యలో మీటర్లు అక్రమంగా జారీ చేసినట్లు తేలడం, వాటి రీడింగ్ తీయకపోవడంతో సంస్థ పరంగా పెద్ద ఎత్తున నష్టం జరిగింది. దీంతోనే ఈ విచారణ కొనసాగుతోంది. మళ్లీ ఎవరిపై కొరడా ఉంటుందనేది ఆసక్తి కలిగిస్తోంది. అప్పట్లో విచారణ పరంగా కొంతమంది పెద్ద అధికారులను తప్పించి చిన్నవారిపై చర్యలు తీసుకున్నారనే విమర్శలు వచ్చాయి. తాజాగా 45 మంది అధికారులు, సిబ్బందిని ఇందులో విచారిస్తున్నారు. అప్పటి ఎస్‌ఈ ప్రస్తుతం డీఈగా ఉన్న ఉత్తం జాడే కూడా ఈ విచారణకు హాజరైనట్లు తెలుస్తోంది. పలువురు వినియోగదారులను కూడా ప్రశ్నిస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ విషయంలో ఆదిలాబాద్ విద్యుత్ శాఖ ఎస్‌ఈ సంపత్‌కుమార్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' యత్నించగా ఆయన విచారణ అధికారులతో కలిసి ఉండడంతో వివరాలు చెప్పలేకపోయారు. ఎంక్వైరీ కొనసాగుతున్నట్లు వివరించారు.

ఆదివాసీ గిరిజనుల భూములు అప్పగించాలి



ధర్నా చేస్తున్న నిర్వాసితులతో సుహాసినీరెడ్డి

కైలాస్‌నగర్: రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ పేరిట ఆదివాసీ గిరిజనుల భూములు లాక్కున్న ఎమ్మెల్యే జోగు రామన్న తిరిగి ఆ భూములను వారికే అప్పగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినీరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం బాధిత రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయిలోని రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ కోసం ఎమ్మెల్యే ఆదివాసీల వద్దకు వెళ్లి వారి వ్యవసాయ భూములు తీసుకున్నారని తెలిపారు. జీవో 40 ప్రకారం పరిశ్రమను మూడేళ్లలో పూర్తి చేసి నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా ఐదేళ్లయినా నిర్మాణం ప్రారంభించలేదని పేర్కొన్నారు. దీంతో భూములు కోల్పోయిన 50 గిరిజన కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. వారికి న్యాయం చేయాలని కోరుతూ.. 2022లో తాము జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్‌ను కలువగా రెండు సార్లు విచారణ చేపట్టారన్నారు. తమ విజ్ఞప్తి మేరకు సమస్యపై విచారించేందుకు స్వయంగా కమిషన్ సభ్యుడు జిల్లాకు వస్తే కలెక్టర్ అందుబాటులో లేకపోవడం విచారకరమన్నారు. కమిషన్ సభ్యుడి ఆహ్వానం మేరకు సమస్య విన్నవించడానికి వచ్చిన ఆదివాసీలతో ఎస్పీ ప్రవర్తించిన తీరు సరిగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ కోసం తీసుకున్న భూములను తిరిగి వారికి అప్పగించేలా చర్యలు చేపట్టి ఆదివాసీలకు న్యాయం చేయాలని కమిషన్‌ను కోరారు. అనంతరం కమిషన్ సభ్యుడు అనంత్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

గిరిజన రైతుల ఆందోళన

ఆదిలాబాద్ రూరల్: రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ కోసం స్థలం ఇచ్చి ఐదేళ్లు గడిచినా పనులు ప్రారంభించకపోవడంపై గిరిజన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన భూముల వద్ద ఆందోళన చేశారు. ఫెన్సింగ్ తొలగించి నాగళ్లతో దున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనులు ప్రారంభించాలని గతంలో జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని, అందుకే తమ భూములను తాము దున్నుకుంటున్నామని పేర్కొన్నారు.

'ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకోవాలి'

కైలాస్‌నగర్: రిమ్స్ ఎదుట గల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి కోరారు. బుధవారం అడిషనల్ కలెక్టర్ ఎన్.నటరాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రిమ్స్ ఎదుట సర్వే నంబర్ 10/2, 12/2, 33/2లో గల భూమిని 10.08.1984న ప్రభుత్వం సాంఘిక సంక్షేమశాఖ డీడీ, ఆర్డీవో ఆధ్వర్యంలో ప్లాట్లు చేసి నిరుపేదలకు పంపిణీ చేసిందన్నారు. అందులోనే కమ్యూనిటీ పర్పస్ కోసం కొంత స్థలాన్ని లేవుట్ ప్రకారం వదిలిపెట్టారని తెలిపారు. కొంతమంది బడాబాబులు వదిలిన భూమిని కబ్జా చేశారని, ఇందుకు అధికారుల వైఫల్యం కారణమని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అరుణ్‌కుమార్ తదితరులున్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రభాకర్‌రెడ్డి

శానిటేషన్ డ్రైవ్ పకడ్బందీగా చేపట్టాలి

ఇంద్రవెల్లి: ఈ నెల 17నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. బుధవారం ఇంద్రవెల్లి పంచాయతీ పరిధి భీంనగర్, మిలింద్‌నగర్, బుద్ధనగర్, హనుమాన్‌నగర్ కాలనీలను సందర్శించారు. డ్రైనేజీలు, తాగునీటి సరఫరా తీరును పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లతో సమావేశమై మాట్లాడారు. డ్రైనేజీలు, సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్ స్థలాలు, బస్టాప్‌లతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని కోరారు. శిథిల ఇళ్లు, భవనాలు తొలగించాలని, పాడుబడ్డ బావులు, పనికిరాని బోర్లను మూసివేయాలని సూచించారు. శానిటేషన్ కార్యక్రమంలో ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని, ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్పంచ్ కోరెంగా గాంధారి, ఎంపీవో సంతోష్, ఈవో సంజీవ్‌రావ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది ఇద్రిస్, నారాయణ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మె ఉధృతం

ఎదులాపురం: ఐకేపీ వీవోఏల డిమాండ్లు వెంటనే నెరవేర్చని పక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వీవోఏల యూనియన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత కోసం ఐకేపీ వీవోఏలు నెల రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. 20 ఏళ్లుగా పని చేస్తున్న వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, రూ.10 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ నెల 22న కలెక్టర్ కార్యాలయం, 29న సెర్ప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో వీవోఏలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వీవోఏల యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్, వీవోఏలు తాజొద్దీన్, విజయ్, రామన్న, అరుణ్, కమల, రాజమణి, శ్యామ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్నమొల్ల కిరణ్

లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్

ఆదిలాబాద్: లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించినప్పుడే ఎక్కువ కేసులు పరిష్కరించగలుగుతామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో ఈనెల 10న జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ కేసుల్లో 50 శాతానికి పైగా రాజీమార్గం ద్వారా పరిష్కరించేవే ఉంటాయని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించి జిల్లాను మొదటి స్థానంలో ఉంచే దిశగా కృషి చేయాలని సూచించారు. అనంతరం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వీ హెల్ప్ ఫర్ పూర్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి శివరాంప్రసాద్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, న్యాయమూర్తులు ప్రవీల జైన్, సూర్యవార్ మంజుల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న వరప్రసాద్, ఉదయ్‌కుమార్‌రెడ్డి

అటవీహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్

కైలాస్‌నగర్: అటవీ హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పీవీటీజీ కుటుంబాలకు నిర్దేశించిన ట్రైకార్ రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతి, ఇప్పటివరకు నమోదైన అట్రాసిటీ కేసుల వివరాలు, బాధితులకు పరిహారం, కేసుల పురోగతిపై చర్చించారు. ఉద్యోగ, ఉపాధి కోసం నమోదు చేసుకున్న ఎస్టీల్లో ఎంతమందికి ఉపాధి కల్పించారనే వివరాలు, అటవీ హక్కు చట్టం కింద వచ్చిన అర్జీలు, పరిష్కరించిన సమస్యల వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. పీఎం ఆది ఆదర్శ గ్రామ యోజన పథకం కింద ఎస్టీల ఆవాసాల్లో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతులు, త్రీఫేజ్ విద్యుత్ తదితర వసతులను కల్పించాలన్నారు. ఇల్లు లేని ప్రతీ ఎస్టీ కుటుంబానికి ఐటీడీఏ ద్వారా పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. అన్ని రంగాల్లో వారికి సేవలు అందేలా చూడాలన్నారు. అంతకుముందు ఐటీడీఏ ద్వారా గిరిజనులకు అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, ఐటీడీఏ ద్వారా వివిధ శాఖల్లో చేపట్టిన కార్యక్రమాల గురించి ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, నటరాజ్, ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీజ, ఆర్డీవోలు రాథోడ్ రమేశ్, కదం సురేశ్, డీడీ దిలీప్‌కుమార్, కమిషన్ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లాకు చేరుకున్న అనంతనాయక్‌కు ఘనస్వాగతం పలికారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనంతనాయక్

హక్కుల పరిరక్షణకు కృషి

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ, గిరిజనుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్ పేర్కొన్నారు. సాలెగూడ, లక్కెట్టిపేట్ గ్రామాల్లో ఆయన పర్యటించగా గుస్సాడీ నృత్యాలతో ఆదివాసీలు ఘనస్వాగతం పలికారు. ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ తండాలు, గూడేల్లో కనీస వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పలువురు ఆయనకు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అంతకుముందు కేబీ కాంప్లెక్స్ క్రీడా పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్, ఆర్డీవో సురేశ్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, ఏవో రాంబాబు తదితరులున్నారు.

ఆస్పత్రిని సందర్శించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్ సందర్శించారు. పరిసరాలు, సౌకర్యాలు పరిశీలించారు. ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఉట్నూర్, సిరికొండ, ఆదిలాబాద్ మండలాల రోగులు, ప్రసూతి కోసం గర్భిణులు ఆస్పత్రికి వస్తారని వైద్యాధికారులు తెలిపారు. సీఎస్‌సీగా మార్చాలని కోరారు. సీనియర్ ఇన్వెస్టిగేటివ్ అధికారి గోవర్ధన్, డీడీ శ్రీదుబే, రీజినల్ అధికారి భోపాల్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, డీడీ ఏటీడబ్ల్యూ దిలీప్, ఇంద్రవెల్లి పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, వైద్యుడు శ్రీకాంత్ తదితరులున్నారు.

ఆదివాసీ చట్టాలు అమలయ్యేలా చూడాలి

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీల చట్టాలు అమలయ్యేలా చూడాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత్‌నాయక్‌ను కోరారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదివాసీల సమస్యలు వివరించారు. డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెస్రం మనోహర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మడావి శంకర్, ఆడ నాగేశ్వర్‌రావ్, సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తులసీరాం, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్క నగేశ్, ఉపాధ్యక్షుడు మెస్రం నగేశ్, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలి

మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన జనాభాకు అనుగుణంగా గిరిజన రిజర్వేషన్లు మాలీలతో కలిపి 10 శాతానికి పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు సాంబన్న శేండే, ఉమేశ్‌రావు డోలే, వాడగురే విజయ్, ఉత్తమ్, శేండే గంగారాం, గజానంద్ మొహుర్లే, ఠాకిరే గజానన్, గురునులే వినోద్, గురునులే గంగారాం, కోట్రంగే అనిల్, శీను ఆచారి, చంద్రశేఖర్ అంబేకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమ కట్టడం కూల్చివేత



జేసీబీతో కూల్చి వేస్తున్న అధికారులు

కుంటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో శిలారీ గణేశ్ అనే వ్యక్తి అక్రమంగా కట్టడం నిర్మించాడు. గ్రామానికి చెందిన పలువురు అక్రమ కట్టడంపై అధికారులకు ఫిర్యాదు చేయడంతో నోటీసులు ఇచ్చినా గణేశ్ స్పందించలేదు. దీంతో బుధవారం ఎంపీవో రహీం, పంచాయతీ కార్యదర్శి రాజబాపు జేసీబీ సాయంతో కూల్చివేశారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఎస్సై హన్మండ్లు పరిస్థితులను చక్కబెట్టారు.

బీజేపీ కార్యకర్త అనే కూల్చివేశారు..

శిలారీ గణేశ్ బీజేపీ కార్యకర్త కావడంతోనే స్థానిక నాయకులకు అధికారులు తలొగ్గి కూల్చివేశారని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పవార్ రామారావుపటేల్ ఆరోపించారు. బుధవారం కూల్చివేసిన కట్టడాన్ని ఆయన పరిశీలించారు.

ఇద్దరిపై కేసు నమోదు

కుంటాల(ముధోల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాన్ని అధికారులు బుధవారం కూల్చివేసిన విషయం తెలిసిందే. విధులకు ఆటంకం కలిగించినందుకు గానూ శిలారీ రాణి, వేముల సాయిపై పంచాయతీ కార్యదర్శి రాజబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు.

ఆగివున్న లారీని ఢీకొన్న కారు

- ఇద్దరికి తీవ్ర గాయాలు




లారీని ఢీకొట్టిన కారు

నేరడిగొండ(బోథ్): మండలంలోని కుప్టి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారు జామున ఆగివున్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సిరికొండ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన పొడే విష్ణు, సైఫ్అలీఖాన్ కారులో నేరడిగొండకు వెళ్తుండగా కుప్టి జాతీయ రహదారి సమీపంలో ఆగివున్న లారీని వెనుకనుంచి ఢీకొట్టారు. ఇద్దరికి గాయాలు కావడంతో గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అయితే ప్రమాదానికి గురైన ఆ కారును మరో లారీ ఢీకొనడంతో పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. సంఘటన స్థలాన్ని ఎస్సై సాయన్న పరిశీలించారు.

నేడు ఓసీపీ బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: భూగర్భ గనుల్లో పనిచేసే ఓవర్‌మెన్లు, హెడ్ ఓవర్‌మెన్లు ఓసీపీలకు బదిలీపై వెళ్లడానికి గురువారం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) అరవింద రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలోని వారికి శ్రీరాంపూర్ వీటీసీలో ఈ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున దరఖాస్తు చేసుకున్న వారు ఈ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు.

మూగజీవాలు విలవిల



మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భానుడు భగభగ మండుతున్నాడు. రోజురోజుకు పెరుగుతున్న ఎండలు, వడగాలులకు మనుషులతో పాటు మూగజీవాలు అల్లాడుతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు నమోదవుతున్నాయి. పాడిపశువులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, ఇతర జీవాలు వేసవితాపంతో అవస్థలు పడుతున్నాయి. వేసవిలో పాడిపశువులు, మూగజీవాల పెంపకందారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ వై.రమేశ్‌కుమార్ వివరించారు.



- చెట్ల నీడన, నీటిమడుగుల్లో ఉపశమనం
- ఎండ దెబ్బతగిలి మృత్యువాత పడే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పశువైద్యులు



ఎండల తీవ్రతతో నీటి మడుగులో ఉపశమనం పొందుతున్న గేదెలు

పెంపుడు జంతువులను వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు తీసుకెళ్లాలి. కొట్టాల చుట్టూ తట్టుబొంతలు కట్టి నీటితో తడిపితే వడగాలుల ప్రభావం తాకదు. పచ్చిమేత, తడిపిన దాణా ఇవ్వడం మంచిది. పశువుకు రోజుకు సుమారు 50 నుంచి 60 లీటర్ల నీటిని తాగించాలి. దాణాతో పాటు లవణ మిశ్రమం, పుష్కలంగా తాగునీరు ఇవ్వడం వల్ల తొందరగా డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడుకోవచ్చు. వడదెబ్బకు గురైన పశువులు, ఇతర జీవాల శరీర ఉష్ణోగ్రత పెరిగి, నోరు తెరిచి భారంగా శ్వాసతీస్తూ అటుఇటు ఉగుతూ బాధపడుతాయి. అలాంటి పశువులను వెంటనే తల, శరీరభాగాలను నీటితో తడుపుతూ నీటిపట్టున ఉంచి సమీపంలో ఉన్న పశువైద్యాధికారికి చూపించి చికిత్స అందించాలి.

వేసవిలో సోకే వ్యాధులు

వేసవిలో పశువులకు గొంతువాపు, జబ్బవాపు వ్యాధులు ఎక్కువగా వస్తాయి. గొంతువాపు ఓ అంటువ్యాధి. వ్యాధి సోకిన పశువులు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది ఎదుర్కోవడం వల్ల గురక లాంటి శబ్దం వస్తుంది. అందుకే దీనిని గురక వ్యాధి అని కూడా అంటారు. ముఖ్యంగా 6 నెలల నుంచి 2 సంవత్సరాల వయస్సు ఉన్న పశువులకు ఎక్కువగా సోకుతుంది. పశ్చరుల్లా మల్టోసిడా అనే బాక్టీరియా వల్ల గొంతువాపు వ్యాధి సోకుతుంది. వాతావరణం చల్లగా ఉండి తేమ ఎక్కువగా ఉన్నప్పుడు, వేసవిలో మేత లేక, వాతావరణంలో ఆకస్మిక మార్పులు సంభవించినప్పుడు, సుదూర ప్రయాణాలు చేసినప్పుడు పశువులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

వేడిగాలుల నుంచి కోళ్లకు రక్షణ..

కోళ్లకు వడదెబ్బ తగలకుండా ఉండాలంటే షెడ్డు మీద గడ్డి, తాటాకులు లేదా కొబ్బరి మట్టల్ని కప్పాలి. దీనివల్ల షెడ్డు లోపలి ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు తగ్గుతాయి. కోళ్ల ఫారం లోకి గాలి ధారళంగా ప్రసరించేలా చూడాలి. అవసరమైతే ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి. షెడ్డు పై భాగంలో స్ప్రింక్లర్లతోనూ ఫాగర్ల వంటి పరికరాలతోనూ నీటి తుంపర్లు పడేలా చూడాలి. కోళ్లకు ఎలక్ట్రోలైట్లను అందించాలి. కోళ్లఫారం చుట్టూ నీడనిచ్చే చెట్లు పెంచడం మంచిది. కోళ్లు వడదెబ్బకు గురైతే వాటిని తల మునగకుండా మిగిలిన శరీరాన్ని చల్లటి నీటిలో ముంచి తీయాలి. దీనివల్ల కోడి శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుతుంది.

కోళ్లకు సోకే వ్యాధులు

కొక్కెర

కోళ్లకు వచ్చే వ్యాధుల్లో అత్యంత భయంకరమైనది కొక్కెర. వ్యాధి సోకిన కోడి ముడుచుకుని ఉంటూ రెక్కల్ని వేలాడేస్తుంది. పక్షవాతపు లక్షణాలు కనిపిస్తాయి. మెడ వెనక్కి వాలుతుంది. తెలుపు, ఆకుపచ్చ రంగులో విరేచనాలు అవుతాయి. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుంది. కోడి శరీరంలోని కొన్ని భాగాల్లో సన్నని రక్తపు చుక్కలు కనిపిస్తాయి. వ్యాధి నివారణకు మందులేవి లేవు. కాబట్టి ఈ వ్యాధి రాకుండా కోళ్లకు ముందుగానే టీకాలు వేయించాలి.

గంబోరో

బాయిలర్ కోడిపిల్లలు వారం నుంచి రెండు నెలల వయసు వచ్చే వరకు గంబోరో వ్యాధికి ఎక్కువగా గురవుతాయి. నీళ్ల విరేచనాలు అవుతాయి. సరిగా నిలబడలేవు. వణుకుతాయి. వ్యాధి సోకిన కోడి పిల్లల్ని వెంటనే ఇతర కోళ్ల నుంచి వేరుచేయాలి. నీటిలో యాంటి బయాటిక్స్ విటమిన్లు కలిపి ఇస్తే కొంత ఉపశమనం లభిస్తుంది. వ్యాధి నివారణకు 10 నుంచి 14 రోజుల వయసులో టీకాలు వేయించాలి.

కోరైజా

ఈ వ్యాధి సోకిన కోడిపిల్లలు మేత, నీటిని సరిగా తీసుకోలేక బరువు కోల్పోతాయి. ముక్కు, కండ్లు ఉబ్బి, తెల్లని చీము గడ్డల మాదిరిగా తయారవుతాయి. పశువైద్యుల సలహా మేరకు కోడిపిల్లలకు వారం రోజుల పాటు యాంటిబయాటిక్స్, విటమిన్లు అందిస్తే వ్యాధి పూర్తిగా నయమవుతుంది.

తగిన సమయంలోనే నీరు, దాణా..

కిలో బరువు దాటిన కోళ్లకు ఉదయం 10 నుంచి సాయత్రం 4 గంటల వరకు దాణా ఇవ్వకూడదు. సాయత్రం వేళ దాణా కొంచెం తడిపి ఇవ్వడం మంచిది. దాణాలో క్రమం తప్పకుండా టాక్సిన్ బైండర్లను కలపాలి. ఎనర్జీ శాతం తక్కువగా ప్రొటీన్ల పరిమాణం తగుమోతాదులో ఉండేలా చూడాలి. టన్నుదాణాకు 200 గ్రాముల విటమిన్ (సి)ని తగిన మోతాదులో సోడా ఉప్పును కలిపితే వడదెబ్బ బారినుంచి కాపాడుకోవచ్చు. వాటికి అందించే నీటిలో విధిగా శానిటైజర్లను కలపాలి. డీప్ లిట్టర్‌లో కోళ్లను పెంచే వారు ఎక్కువ నీటిగిన్నెల్ని ఏర్పాటు చేయాలి. చల్లని నీటిని అందుబాటులో ఉంచాలి. కోడి పిల్లలకు చల్లని నీటిలో ఎలక్ట్రోలైట్లను కలిపి ఇవ్వడం ద్వారా డీహైడ్రేషన్ సమస్య నివారించవచ్చు.

బాలిక అపహరణ కేసులో ఒకరి అరెస్ట్

సారంగాపూర్(నిర్మల్): మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను కిడ్నాప్‌కు యత్నించిన కేసులో ఒకరిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. 15 రోజుల క్రితం ఓ బాలికను మరో బాలుడు అపహరణకు యత్నించాడని పేర్కొన్నారు. దీంతో బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బాలున్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతనికి సహకరించిన నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన అతని స్నేహితుడు జెందాడే సచిన్(18)ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా గన్నేరి గ్రామానికి చెందిన బోర్కర్ సంతోష్(45) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 16న అతిగా మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్య మందలించింది. దీంతో మధ్యాహ్నం ఇంటినుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా ఊరి చివర వాగు వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. పురుగుల మందు తాగినట్లు తెలపడంతో మహారాష్ట్రలోని అర్లి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వరి పంట దగ్ధం



ఆలూరులో దగ్ధమవుతున్న వరిపంట

సారంగాపూర్(నిర్మల్): మండలంలోని ఆలూరులో పుట్టి నడిపి పోశెట్టికి చెందిన 14 గుంటలు, లోలం సులోచనకు చెందిన 15గుంటల వరిపొలం బుధవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక యంత్రం వచ్చేలోగానే పంట కాలి బూడిదైందని ఎంఆర్ఐ ముంతాజ్ తెలిపారు. ఆకతాయిలు పొగతాగి ఆర్పకుండా పారేయడం వల్లే పంటకు నిప్పంటుకుందన్నారు. ప్రమాదంలో దాదాపు రూ.25వేలు నష్టం జరిగినట్లు నిర్ధారించారు.

ఈగలమోత వేగలేమని ఆందోళన



గ్రామస్తులతో మాట్లాడుతున్న కంపెనీ ఎండీ శ్రీకాంత్

సారంగపూర్: మండలంలోని గోపాల్‌పేట్ తండా సమీపంలోని గుట్టపై ధరణీ బ్రీడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్మించిన కోళ్ల విత్తనోత్పత్తి కేంద్రం కారణంగా తమ గ్రామంలో ఈగలమోత ఎక్కువైందని, దీనివల్ల అనారోగ్యం బారిన పడుతున్నామని గ్రామస్తులు బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. విత్తనోత్పత్తి కేంద్రానికి వెళ్లే రహదారిని అడ్డంగా తవ్వేసి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న కంపెనీ ఎండీ శ్రీకాంత్ అక్కడకు చేరుకుని గ్రామస్తులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే విత్తనోత్పత్తి కేంద్రం నిర్మాణ పనులు కొనసాగుతుండగా దానికి సామగ్రి తరలించే భారీ వాహనాల వల్ల ప్రధాన పైపులైన్ పగిలి నీరందక సైతం ఇబ్బందులు పడుతున్నామని మాపరిస్థితి ఏమిటని గ్రామస్తులు ఆగ్రహించారు. వెంటనే సదరు ఎండీ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్డీఓ స్రవంతి, తహశీల్దార్ సంతోష్‌రెడ్డి గ్రామానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. సదరు కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్‌తో రాతపూర్వకంగా బ్రీడర్ కేంద్రాన్ని మూసివేయిస్తామని అంగీకార పత్రం రాయించడంతో పాటు 24గంటల్లో ఈగల బెడద పరిష్కరించి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయిస్తామని అంగీకరించడంతో ఆందోళన విరమించారు.

డిగ్రీ 4, 6 సెమిస్టర్ల పరీక్షలు వాయిదా

- ఎండల నేపథ్యంలో పలువురి విజ్ఞప్తి మేరకు నిర్ణయం
- జూన్ 13 నుంచి పరీక్షలు



పరీక్షలు వాయిదా వేయాలని వీసీని కోరుతున్న లెక్చరర్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పలు సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సులు బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, ఒకేషనల్, బీసీఏ, బీఏ(ఎల్) పీడీసీ కోర్సుల 4, 6వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ మధుకర్, డాక్టర్ నరేందర్ బుధవారం వెల్లడించారు. జూన్ 13 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేయూ పరిధిలో డిగ్రీ 4, 6వ సెమిస్టర్ల పరీక్షలు కీలకమైనవి. మే నెలలోనే నిర్వహించాలనే విధంగా రెండు మూడుసార్లు టైం టేబుల్ షెడ్యూల్స్‌ను విడుదల చేసిన పరీక్షల విభాగం అధికారులు వివిధ కారణాలతో ముఖ్యంగా వివిధ సెట్ల పరీక్షలు ఉండడంతో వాయిదా వేస్తూ వచ్చారు. చివరికి ఈ నెల 22 నుంచి పరీక్షలు నిర్వహిస్తామని టైం టేబుల్ విడుదల చేశారు. ఈ షెడ్యూల్‌ను ప్రకటించాక వేసవిలో ఎండలు మండిపోతున్నాయని, తమకు ఇబ్బంది అని పరీక్షల విధులను నిర్వహించాల్సిన వివిధ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పరీక్షల విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హనమకొండ, వరంగల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలకు చెందిన పలువురు మహిళా అధ్యాపకులు బుధవారం వీసీ ఆచార్య తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్, పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డిని కలిసి డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలని విన్నవించారు.

ఆలస్యమైతే ఫలితాలపై ప్రభావం

డిగ్రీ కోర్సుల విద్యార్థులకు 6వ సెమిస్టర్ పరీక్షలు కీలకమైనవి. ఈ పరీక్షలు మే, జూన్‌లో పూర్తయితేనే ఫలితాలు సకాలంలో వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పుడు జూన్, జూలైలో జరగబోతున్నందువల్ల ఫలితాలపై ప్రభావం చూపనుందని భావిస్తున్నారు. ఎందుకంటే డిగ్రీ కోర్సుల 6వ సెమిస్టర్ పరీక్షలతో కోర్సు పూర్తయితే ఉన్నత విద్య ఇతర కోర్సుల్లోకి ప్రవేశాలకు అవకాశం కలుగుతుంది. ఉన్నత విద్యలోని పీజీతోపాటు వివిధ ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశపరీక్షలు అన్ని మే నెలలోనే జరగబోతున్నాయి. వాటి ఫలితాలు వచ్చేలోగా డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలు పూర్తిచేసి ఫలితాలను సకాలంలో ఇస్తేనే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేదంటే విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశం లేకపోలేదు.

రేషన్ షాపు వద్ద గ్రామస్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పెంబి: లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు తీసుకుని మూడు నెలలుగా రేషన్ డీలర్ బియ్యం పంపిణీ చేయడం లేదంటూ బుధవారం షాపు వద్ద లబ్ధిదారులు ఆందోళన చేసిన ఘటన నిర్మల్ జిల్లా పెంబి మండలం శెట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తమ వెలిముద్రలు తీసుకుని మూడు నెలలుగా రేషన్ బియ్యం పంపిణీ చేయకుండా స్టాక్ లేవని డీలర్ చెబుతున్నాడని ఫిర్యాదు చేయడంతో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హనుమాన్ దుకాణాన్ని పరిశీలించారు. షాప్‌కు తాళం వేసి ఉండడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించి బియ్యం పంపిణీ చేసే విధంగా చర్యలు చేపడుతామని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు.

ప్రమాదవశాత్తు బత్తాయి లారీ దగ్ధం



దగ్ధమవుతున్న లారీ

గుడిహత్నూర్(బోథ్): మండలంలోని జాతీయ రహదారి 44పై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో బత్తాయి పండ్లతో వెళ్తున్న లారీ దగ్ధమైంది. స్థానికులు తెలిపిన ప్రకారం కర్ణాటక రాష్ట్రంలోని పోలార్‌కు చెందిన డ్రైవర్ నఫీజ్ అక్కడి నుంచి బత్తాయి పండ్లను లారీలో నాగ్‌పూర్‌కు తరలిస్తున్నాడు. సీతాగోంది వద్దకు రాగానే డీజిల్ ట్యాంక్ మూత పడిపోయి ఉండడంతో సైలెన్సర్ ద్వారా రగిలిన నిప్పురవ్వలు ట్యాంకుకు అంటుకున్నాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి టైర్లు పూర్తిగా కాలిపోవడంతో లారీ నేల కొరిగింది. అప్రమత్తమైన లారీ డ్రైవర్ నఫీజ్ కిందికి దిగి స్థానికుల సహాయంతో పోలీసులను సంప్రదించాడు. దీంతో పోలీసులు అగ్నిమాపక దళానికి సమాచారం అందించడంతో మంటలను ఆర్పి వేసినా అప్పటికే లారీ పూర్తిస్థాయిలో దగ్ధమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.





ఇంటి నుంచి ఫ్యాన్ తెచ్చుకున్న బాలింత



ఇంటి నుంచి కూలర్ తెచ్చుకున్న బాలింత

గాలి ఆడదు.. నీరు అందదు..



రోజురోజుకూ పెరుగుతున్న ఎండలతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పిల్లలతో పాటు తల్లులు కూడా వేడికి తట్టుకోలేక ఇంటి నుంచే ఫ్యాన్లు, కూలర్లు తెచ్చుకుని ఉపశమనం పొందుతున్నారు. దీనికి తోడు తాగునీటి నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని గర్భిణులు, బాలింతలు వాపోతున్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్